# వీఆర్ఓ/వీఆర్ఏ సందేహాలు

**వీఆర్ఓ పరీక్షలో జనరల్ స్టడీస్‌లోని 60 మార్కుల్లో గ్రామీణ జీవన విధానంపై 50 శాతం ప్రశ్నలుంటాయని పేర్కొన్నారు. వీటికి ఎలా ప్రిపేర్ అవ్వాలి?**

– వాసు, హైదరాబాద్

జనరల్ స్టడీస్‌లో చరిత్ర, భూగోళ శాస్త్రం, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవ శాస్త్రం, కరెంట్ అఫైర్స్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. వీటిల్లో 50 శాతం ప్రశ్నలు అంటే.. 30 మార్కులకు గ్రామీణ జీవన విధానంపై ప్రశ్నలు ఉంటాయి. గ్రామీణ నేపథ్యం, పంటలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రామీణాభివృద్ధి పథకాలు, ఉపాధి హామీ పథకం, ఇందిరా క్రాంతి, సబల, ఆసరా, స్త్రీ నిధి, డ్వాక్రా, మధ్యాహ్న భోజన పథకం, జవహర్ ఆరోగ్య రక్ష, మాతృత్వ సహవాగ్ యోజన, 104, 108 సేవలు, రాజీవ్ యువకిరణాలు, ఇందిరా జలప్రభ, అంగన్‌వాడి, గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలు, ప్రథమ చికిత్స, గ్రామపంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ విధులు, చెరువులు, కాలువలు, నీటిపారుదల వ్యవస్థ, పంట రుతువులు, పంట కాలాలు, రుతుపవనాలు, పంటలు–అధికంగా పండే జిల్లాలు, ఆయా పరిశ్రమలు–అవి నెలకొన్న ప్రదేశాలు, ముడి ఖనిజాలకు పేరొందిన ప్రాంతాలు, పశువులు, పశుజాతులు, పశు క్రాంతి, గోపాల మిత్ర, పెన్షన్లు, వైఎస్ఆర్ అభయ హస్తం వంటి వాటికి సంబంధించి ప్రశ్నలు వస్తాయి. ఆయా పథకాలు–ప్రవేశపెట్టిన సంవత్సరాలు–పథకాల ముఖ్య ఉద్దేశం–లక్ష్యాలపై ప్రశ్నలు వస్తాయి. తుఫానులు, కరువుకాటకాలు, ప్రాజెక్టులకు సంబంధించి కూడా ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. వీటిపై ఆరు నుంచి పదో తరగతి వరకు ఉన్న పాఠ్యపుస్తకాలతో పాటు ఏదైనా ప్రామాణిక మెటీరియల్ ద్వారా అవగాహన పెంచుకోవాలి. గ్రామీణ విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సాక్షి విద్యలో ఒకటిన్నర వీఆర్ఓ/వీఆర్ఏ మెటీరియల్‌ను విస్తృతంగా అందిస్తున్నాం. దాంతోపాటు భవితలో వీఆర్ఓ/వీఆర్ఏ గ్రాండ్ టెస్ట్‌లను ఇస్తున్నాం.

**నేను వీఆర్ఓ పరీక్షకు సిద్ధమవుతున్నాను. మా సొంతూరు వరంగల్. నేను పదో తరగతి వరకు వరంగల్‌లోనూ, ఇంటర్మీడియెట్ హైదరాబాద్‌లో చదివాను. నేను వరంగల్‌కు అప్లై చేసుకోవాలా.. హైదరాబాద్‌కు దరఖాస్తు చేసుకోవాలో తెలపండి?**

–రాజేశ్, వరంగల్

మీరు నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు వరంగల్‌లోనే చదివారు కాబట్టి మీరు నిస్సందేహంగా వరంగల్ జిల్లాకు చెందినవారే అవుతారు. కాబట్టి వరంగల్ జిల్లా పోస్టులకు మీరు దరఖాస్తు చేసుకోండి. హైదరాబాద్ జిల్లా పోస్టులకు మీరు అర్హులు కాదు.

**నేను వీఆర్‌ఓ పరీక్షకు సిద్ధమవుతున్నాను. ఏడో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను (బయాలజీ, ఫిజికల్ సైన్స్, సోషల్) ప్రిపేరవుతున్నాను. ఇవి కాకుండా ఇంకా ఏఏ పుస్తకాలు చదవాలి?**

–ప్రవీణ, మున్నంగి

అర్థమెటిక్ ఎబిలిటీ, లాజికల్ స్కిల్స్ కోసం ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న గణితం పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయండి. వీటితోపాటు గ్రామీణ అభ్యర్థుల కోసం రోజూ సాక్షి విద్యలో అందిస్తున్న ఒకటిన్నర పేజీల వీఆర్‌ఓ మెటీరియల్‌ను, ప్రతి గురువారం భవితలో అందిస్తున్న గ్రాండ్ టెస్ట్‌ను, సాక్షి ఎడ్యుకేషన్ డాట్ కామ్‌లో అందిస్తున్న బిట్‌బ్యాంక్స్, చాప్టర్ వైజ్ సిలబస్‌ను, కరెంట్ అఫైర్స్‌ను కూడా అధ్యయనం చేస్తే వీఆర్‌ఓగా విజయం సాధించొచ్చు.

**వీఆర్‌ఓ పరీక్షలో లాజికల్ స్కిల్స్‌లో ఎలాంటి ప్రశ్నలు అడిగే అవకాశముంది?**

– శెట్టి శిరీష, తెనాలి

వీఆర్‌ఓ పరీక్షలో లాజికల్ స్కిల్స్‌లో పది మార్కులకు ప్రశ్నలుంటాయి. ఇందులో కోడింగ్–డీకోడింగ్, పోలికలు, బంధాలు, నెంబర్ సిరీస్, లెటర్ సిరీస్, భిన్న లక్షణాల నిర్ధారణ, దిశ నిర్ధారణ, క్యాలెండర్, నాన్ వెర్బల్ రీజనింగ్‌లపై ప్రశ్నలుంటాయి. ఇందుకోసం ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న మ్యాథ్స్ పాఠ్యపుస్తకాలను అధ్యయనం చేయండి.. సాక్షి విద్యలో ప్రతి రోజూ అందిస్తున్న ఆర్టికల్స్‌ను ఫాలో అవ్వండి. www.sakshieducation.comలో వీఆర్‌ఓ/వీఆర్‌ఏ పరీక్షకు సంబంధించిన అన్ని విభాగాల్లోనూ విస్తృతమైన మెటీరియల్ లభ్యమవుతోంది. వాటిని బాగా చదువుకోండి.

**నేను పదో తరగతి పూర్తిచేసిన తర్వాత ఇంటర్ లేకుండా దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేశాను. వీఆర్‌ఓ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చా?**

– సంగీత, సిరిపురం

సీసీఎల్‌ఏ వెలువరించిన నోటిఫికేషన్ ప్రకారం వీఆర్‌ఓ పోస్టులకు అర్హత ఇంటర్మీడియెట్. ఇంటర్ లేకుండా డిగ్రీ, పీజీ చేసినా అర్హులు కాదు. మీకు వీఆర్‌ఓ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. మీ గ్రామంలో వీఆర్‌ఏ పోస్టు ఖాళీగా ఉంటే దానికి మీరు అప్లై చేసుకోవచ్చు.

**వీఆర్‌ఓ పరీక్షలో సోషల్ స్టడీస్‌లో ఏ ఏ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు?**

–ప్రతిమ, అమరావతి

చరిత్ర: ఆధునిక ప్రపంచం, భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన, బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు, ఆర్థిక, సామాజిక రంగాల్లో మార్పులు, భారత జాతీయ స్వాతంత్ర్యోద్యమం, ఆదిమ చరిత్ర, కాంస్య యుగపు నాగరికత, ప్రాచీన ఇనుపయుగ నాగరికత, మధ్య యుగం, భారతదేశ సాంస్కృతిక వారసత్వం.

**భూగోళ శాస్త్రం:** భౌతిక భూగోళ శాస్త్రం, సౌర కుటుంబం, భూమి, భూచలనాలు, భూ అంతర్భాగం, అక్షాంశాలు, రేఖాంశాలు, గ్రహణాలు, ఖండాలు. భారతదేశం, ఆంధ్రప్రదేశ్ భూగోళ శాస్త్రం, నైసర్గిక మండలాలు, నదులు, శీతోష్ణస్థితి, వరదలు, కరువు కాటకాలు, అడవులు, పశు సంపద, మృత్తికలు, విద్యుత్, వ్యవసాయం, ఖనిజ సంపద, పరిశ్రమలు, జనాభా, రవాణా, సమాచార సాధనాలు, ఓడరేవులు, దర్శనీయ ప్రదేశాలు, భూకంపాలు, అగ్నిపర్వతాలు, మహా సముద్రాలు, వాతావరణ నివేదికలు, ప్రకృతి సిద్ధ మండలాలు. ఆంధ్రప్రదేశ్‌లో రుతుపవనాలు, పంటలు, వర్షపాతం.

**పౌరశాస్త్రం:** ప్రజాస్వామ్యం, సామ్యవాదం, లౌకికతత్వం, ప్రపంచశాంతి. భారత రాజ్యాంగం, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక స్వపరిపాలన, రోడ్లు – భద్రత, విద్య, భారత జన్మభూమి, ఐక్యరాజ్యసమితి. పంచాయతీరాజ్ వ్యవస్థ, వాటి విధులు.

**అర్థశాస్త్రం:** మౌలిక భావనలు, ఉత్పత్తి, మారకం, పంపిణీ, జాతీయాదాయం, స్థూల, సూక్ష్మ అర్థశాస్త్రం, ఆర్థికాభివృద్ధి, రాబడి– వ్యయం, బడ్జెట్, ద్రవ్యం– బ్యాంకింగ్. భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ప్రణాళికలపై సోషల్ స్టడీస్ నుంచి ప్రశ్నలుంటాయి.

నేను వీఆర్ఓ పరీక్షకు సిద్ధమవుతున్నా. జనరల్ స్టడీస్‌కు ఎలా ప్రిపేర్ కావాలో చెప్పండి? గ్రామీణ నేపథ్యంపై ఎలాంటి ప్రశ్నలొస్తాయి?

– ఆర్.రామయ్య, హైదరాబాద్

వీఆర్ఓ పరీక్షలో జనరల్ స్టడీస్‌కు 60 మార్కులుంటాయి. ఇందులో 50 శాతం అంటే 30 మార్కులు గ్రామీణ నేపథ్యంపై ప్రశ్నలుంటాయి. ప్రధానంగా నేలలు– రకాలు, పంటలు–పంటకాలాలు–పంట రుతువులు–వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, నీటిపారుదల (కాలువలు, చెరువులు, బావులు), నదులు– ప్రాజెక్టులు, పశు సంపద, రోడ్లు, గ్రామీణ ఆరోగ్య సంస్థలు (అంగన్‌వాడీ, ఆశ, దాయిలు, ప్రాథమిక ఆర్యోగ కేంద్రాలు, ఆరోగ్య కార్యకర్తలు), శీతోష్ణస్థితి, పరిశ్రమలు, వివిధ వర్గాల వారికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, వర్షపాతం, పంచాయితీరాజ్ వ్యవస్థ (గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లాపరి షత్)–వాటి విధులు, జీవరాశులు, పోషణ, పరిశుభ్రత, జనాభా, పేదరికం మొదలైన వాటిపై ప్రశ్నలుంటాయి.

ప్రిపరేషన్ ఇలా: జనరల్ స్టడీస్‌కు సిద్ధమవ్వాలంటే 4 నుంచి 10వ తరగతి వరకు తెలుగు అకాడెమీ పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవండి. వీటితోపాటు ఏదైనా ప్రామాణిక మెటీరియల్‌ను, కరెంట్ అఫైర్స్ కోసం సాక్షి భవిత, విద్య, సాక్షి ఎడ్యుకేషన్.కామ్‌ను చూడండి. అంతేకాకుండా ప్రతి రోజూ సాక్షి విద్యతో పాటు www.sakshieducation. comలో వీఆర్ఓ పరీక్షకు సంబంధించి విస్తృత మెటీరియల్ లభ్యమవుతోంది.

**నేను వీఆర్‌ఓ రాత పరీక్షకు దరఖాస్తు చేశాను. పరీక్ష స్వరూపాన్ని వివరించండి? పరీక్షకు ఎలా ప్రిపేరవ్వాలో తెలపండి?**

– జానకిరామిరెడ్డి, హైదరాబాద్

వీఆర్‌ఓ ఉద్యోగాలకు ఎంపికైన వారు గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించాలి. కాబట్టి వీఆర్వో రాత పరీక్షలో అర్థమెటిక్ స్కిల్స్, లాజికల్ స్కిల్స్‌తోపాటు ప్రధానంగా గ్రామీణ ప్రాంత స్థితిగతులు, అక్కడి ప్రజల జీవన విధానాలపై ప్రశ్నలు అడుగుతారు. రాత పరీక్ష మొత్తం 100 మార్కులకు, ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. నెగిటివ్ మార్కులు ఉండవు. ప్రశ్నపత్రం ఇంటర్మీడియెట్ స్థాయిలో ఉంటుంది. మొత్తం 100 మార్కుల్లో జనరల్ స్టడీస్-60, అర్థమెటిక్ స్కిల్స్-30, లాజికల్ స్కిల్స్-10 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. జనరల్ స్టడీస్‌లోని 60 ప్రశ్నల్లో 30 ప్రశ్నలు గ్రామీణ ప్రాంతాలకు సంబంధించినవి అడుగుతారు. భారతదేశ చరిత్ర, ఆంధ్రప్రదేశ్ చరిత్ర, భారత రాజ్యాంగం, అందులో ముఖ్యమైన ఆర్టికల్స్, రాజ్యాంగ సవరణలు, ఎకనామిక్స్, జాగ్రఫీ, జనరల్ సైన్స్, జనరల్ నాలెడ్జ్, వంటివాటిపై కూడా దృష్టి సారించాలి. ఏడో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ తెలుగు మీడియం పాఠ్యపుస్తకాలు చదివితే మంచి స్కోరింగ్ చేయొచ్చు. అర్థమెటిక్ స్కిల్స్, లాజికల్‌స్కిల్స్‌లో మంచి మార్కులు సాధించాలంటే ప్రాక్టీస్ తప్పనిసరి. బట్టీ విధానం కుదరదు. అర్థమెటిక్ స్కిల్స్, లాజికల్ స్కిల్స్‌లో పట్టు సాధిస్తే 40 ప్రశ్నలకు కనీసం 25 నుంచి 28 మార్కుల వరకు సులువుగా సాధించొచ్చు.

**నేను వీఆర్‌ఓ పరీక్షకు సిద్ధమవుతున్నాను. పరీక్ష తెలుగు, ఇంగ్లిష్ రెండు మాధ్యమాల్లో ఉంటుందా? పరీక్షకు సంబంధించి తెలుగులో మెటీరియల్ లభిస్తుంది కానీ ఇంగ్లిష్‌లో మెటీరియల్ లభించడం లేదు? నేను ఎలా ప్రిపేర్ కావాలో చెప్పండి?**

– ఆశ్రిత, హైదరాబాద్

వీఆర్‌ఓగా ఎంపికైనవాళ్లు ప్రధానంగా గ్రామాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అందులోనూ గ్రామాల్లో నిరక్షరాస్యుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వారి కష్టనష్టాలను తెలుసుకోవాలంటే.. తెలుగుపై పట్టు తప్పనిసరిగా ఉండాలి. అందువల్లే భూ పరిపాలన శాఖ అధికారులు కూడా వీఆర్‌ఓ పరీక్ష కేవలం తెలుగు మీడియంలోనే ఉంటుందని తెలిపారు. కాబట్టి ఇంగ్లిష్ మాధ్యమంలో వీఆర్‌ఓ పరీక్ష ఉండదు. మెటీరియల్ విషయానికొస్తే... ఇంగ్లిష్ కంటే తెలుగులోనే ఎక్కువగా లభిస్తుంది. ఐదు నుంచి పదో తరగతి వరకు ఉన్న సైన్స్, సోషల్, మ్యాథ్స్ ఇంగ్లిష్ మీడియం పుస్తకాలను క్షుణ్నంగా చదవండి. వీటితోపాటు ఇంటర్మీడియెట్ జాగ్రఫీ, సివిక్స్, ఎకానమీ, చరిత్ర పాఠ్యపుస్తకాలను కూడా అధ్యయనం చేయండి. ఇలా చేస్తే సిలబస్ మొత్తం దాదాపు కవర్ చేసినట్లే. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి వివిధ పుస్తకాలు మార్కెట్‌లో విరివిగా లభ్యమవుతున్నాయి. అదేవిధంగా సాక్షి విద్య, భవిత, సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌పోర్టల్‌లో వీఆర్‌ఓ పరీక్షకు సంబంధించి విస్తృత సమాచారం లభ్యమవుతోంది.

**నేను వీఆర్‌ఓ పరీక్షకు సిద్ధమవుతున్నాను. పరీక్ష ఇంగ్లిష్/తెలుగు రెండు మాధ్యమాల్లో ఉంటుందా?**

– మాధురి, నందిగామ

వీఆర్‌ఓలుగా ఎంపికైనవాళ్లు ప్రధానంగా గ్రామ సీమల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అందులోనూ అక్కడి రాతపూర్వక వ్యవహారాలన్నీ తెలుగులోనే జరుగుతాయి. కాబట్టి వీఆర్‌ఓ పరీక్ష కేవలం తెలుగులో మాత్రమే ఉంటుంది. ఇంగ్లిష్‌లో ఉండదు.

**నేను వీఆర్‌ఓ పరీక్షకు సిద్ధమవుతున్నాను. కరెంట్ అఫైర్స్ మీద పట్టు సాధించడం ఎలా? ఏఏ బుక్స్ చదివితే ఇందులో ఎక్కువ మార్కులు పొందొచ్చు?**

– తోట బసవశంకరరావు, కొల్లూరు

వీఆర్‌ఓ పరీక్షలో కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి ప్రభుత్వ అభివృద్ధి పథకాలు, విద్య, ఆరోగ్యం, జనాభా, పారిశ్రామిక రంగం, పేదరికం, ద్రవ్యోల్బణం, నీటిపారుదల, చట్టాలు–సవరణలు, న్యాయస్థానాలు, పర్యావరణం, సాంకేతిక పరిజ్ఞానం, జల, ఇంధన వనరులు, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ సంబంధిత అంశాలపై ప్రశ్నలుంటాయి. నాలుగు నుంచి పదో తరగతి వరకు ఉన్న పాఠ్యపుస్తకాలు చదివితే సిలబస్ చాలావరకు పూర్తిచేసినట్లే. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ సంబంధిత అంశాలపై వీఆర్‌ఓ నోటిఫికేషన్ విడుదల తేదీనాటికి ఆరు నెలల ముందు నుంచీ ఉన్న కరెంట్ అఫైర్స్‌ను చదువుకుంటే సరిపోతుంది. ఇందులో వ్యక్తులు–నియామకాలు–అవార్డులు–గ్రంథాలు, ముఖ్య సదస్సులు, క్రీడలు–రికార్డులు మొదలైన అంశాలను చదువుకుంటే కరెంట్ అఫైర్స్‌లో అత్యధిక మార్కులు సాధించవచ్చు. ఇందుకోసం సాక్షి విద్య, భవిత, సాక్షి ఎడ్యుకేషన్‌డాట్.కామ్ చూడండి. గత రెండేళ్ల కరెంట్ అఫైర్స్ సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో లభిస్తున్నాయి.

**నేను పాలిటెక్నిక్ ఈసీఈ పూర్తి చేశాను. వీఆర్‌ఓ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి నాకు అర్హత ఉందా?**

– కిశోర్‌గోపి, ఏవీ పాలెం

వీఆర్‌ఓ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలంటే తప్పనిసరిగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలి. మీరు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కాదు.

SAKSHI